



పించనుకోసం తిరిగి అలసిపోయా

ఐదు నెలలుగా పక్షవాతంతో బాధపడుతున్నా. కూలి పనులకు వెళ్లేందుకు కూడా శరీరం సహకరించడంలేదు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. పించను కోసం తిరిగి తిరిగి అలసిపోయా. ఇకనైనా పించనిచ్చి ఆదుకోండి.

- ఇదీ వెంకటగిరి పట్టణం అమ్మపాళేనికి చెందిన రాజమ్మ ఆవేదన. ఇలా జిల్లా వ్యాప్తంగా 260 మంది సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి పీజీఆర్ఎస్‌లో ఉన్నతాధికారులకు తమ సమస్యలను విన్నవించి వినతులిచ్చారు.


- 8లో

ప్రైవేట్ చేతికి టూరిజం హోటల్

- హరిత ప్రాజెక్టును చేజిక్కించుకున్న 'మృగవాణి'
- గత వైసీపీ హయాంలో జరిగిన టెండరు
- 33 ఏళ్లకు లీజు, ఏడాదికి రూ.కోటి అద్దె
- టెండరు దక్కించుకున్న 22 నెలల తర్వాత మొదలైన పనులు

తిరుపతి నగరం అలిపిరి సమీపంలోని రుయాస్పత్రికి ఎదురుగా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చేపట్టిన 103 గదుల హరిత హోటల్ ప్రాజెక్ట్ ఎట్టకేలకు ప్రైవేట్ చేతికి వెళ్లిపోయింది. 2023 అక్టోబరులో వైసీపీ హయాంలో నిర్వహించిన టెండర్లలో తక్కువ అద్దెతో దక్కించుకున్న 'మృగవాణి' రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 22 నెలల తర్వాత సోమవారం పనులు మొదలుపెట్టింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతిలో ఓ స్టార్ హోటల్ కట్టాలని ఏపీటీడీసీ నిర్ణయించింది. దీంతో 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తిరుమలకు వచ్చే యాత్రికులను దృష్టిలో పెట్టుకుని రూ.17 కోట్ల బడ్జెట్‌తో హరిత హోటల్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇందులో రూ.7 కోట్లను విడుదల చేయడంతో నిర్మాణ పనులు వేగంగా జరిగాయి. 1.03 ఎకరాల విస్తీర్ణంలో తొలిదశలోనే భవన నిర్మాణపు సివిల్ వర్క్ దాదాపు పూర్తయిపోయింది. ఇంతలో అధికారుల అలసత్వమో, రాజకీయ కారణమో తెలియదుకానీ హరిత హోటల్ ప్రాజెక్టు ముందుకు కదలలేకపోయింది. ఈ క్రమంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణకు ఇవ్వాలని 2020 ఆగస్టు 27న ఈ-టెండర్ నిర్వహించింది. హైదరాబాద్‌కు చెందిన చంద్రహాస్ ఎంటర్‌ప్రైజెస్ ఏడాదికి రూ1.53కోట్లతో టెండర్ దక్కించుకుంది. ఏడాదికి 5 శాతం పెంచుకుంటూ 33 సంవత్సరాలపాటు హోటల్‌ను నిర్వహించుకోవచ్చని చెప్పింది. కారణాలేమోగాని వారు ముందుకు రాలేదు. ఆతర్వాత అద్దె ధర తగ్గించుకుంటూ ఏడాదికి రూ.కోటి అద్దెకు కుదించి 2023లో టెండరు పిలిచారు. పలుచోట్ల రిసార్ట్స్, హోటల్స్ కలిగిన మృగవాణి సంస్థ చేజిక్కించుకుంది.

ప్రైవేట్ పరంపై విమర్శలు

అలిపిరి సమీపంలోని విశాలమైన స్థలంలో హరిత హోటల్ కోసం నిర్మించిన 5 అంతస్థుల భవనంలో 103 గదులు, 200 మంది కూర్చునేలా రెస్టారెంట్, 3 కాన్ఫరెన్స్ హాళ్లు, ఒక ఫంక్షన్ హాల్, డార్మిటరీ అకామడేషన్, 100 కార్లు నిలిపే సదుపాయాలున్నాయి. అత్యంత ప్రాధాన్యత కలిగిన అలిపిరి సమీపంలో నెలకు రూ8.3లక్షల అద్దెకోసం ఐదంతస్థుల విశాలమైన భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో తిరుచానూరు సమీపంలో టీటీడీ నిర్మించిన పద్మావతి నిలయాన్ని (ప్రస్తుత కలెక్టరేట్) ఏపీటీడీసీ ఏడాదికి కోటి రూపాయల అద్దెతో తీసుకుంది. అదే టూరిజం విభాగం తనకున్న భవనాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అదే అద్దెకు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. ఇదిలా ఉంటే వైసీపీ హయాంలో దక్కించుకున్న టెండరు కాలపరిమితి ముగిసిన తర్వాత పనులు మొదలు పెట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

'స్కిట్'కు పునరుజ్జీవం

- ఇంజనీరింగ్ అడ్మిషన్ల వెబ్‌సైట్‌లో కళాశాల పేరు
- ఈ ఏడాది నుంచే తరగతులు
- ఫలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)కి కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం నింపింది. సోమవారం ఎంసెట్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో స్కిట్ కళాశాలకు స్థానం కల్పించి అడ్మిషన్లకు ఆహ్వానం పలికారు. ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి ఫలించడంతో ఈ ఏడాది నుంచే ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

1997లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుసంధానంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను చేరువ చేయాలని భావించారు. ఆ మేరకు శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని ప్రారంభించారు. ఈ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. సీట్ల కోసం పెద్దఎత్తున సిఫార్సులు కూడా వచ్చేవి. గత వైసీపీ పాలనలో స్కిట్ కళాశాల పర్యవేక్షణలో విఫలమయ్యారు. దాంతో క్రమంగా విద్యార్థుల చేరిక తగ్గిపోయింది. 2021 డిసెంబరు నెలలో విద్యాసంవత్సరం మధ్యలోనే అర్థాంతరంగా కళాశాలను మూసేశారు. స్కిట్‌ను మూసివేయడం తగదంటూ విద్యార్థులు, యువత ఆందోళన వ్యక్తంచేసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ప్రజల అభీష్టం మేరకు గతేడాది ఎన్నికల సందర్భంగా స్కిట్ కళాశాలను పునఃప్రారంభిస్తామని చంద్రబాబు పాల్గొన్న బహిరంగ సభలో బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సుధీర్‌రెడ్డి స్కిట్ కళాశాలను తిరిగి ప్రారంభించేందుకు పలుమార్లు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. మంత్రి





ఇంజనీరింగ్ అడ్మిషన్ల వెబ్‌సైట్‌లో స్కిట్ కళాశాల

చొరవతో స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూతో అనుసంధానం చేయడంపై ఉన్నతస్థాయి అధికారుల కమిటీని నియమించారు. నెల రోజుల కిందట ఈ ప్రక్రియ పూర్తయింది. కళాశాలలో తరగతి గదులు ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సోమవారం ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా స్కిట్ కళాశాలను పొందుపరిచారు. మొదటి సంవత్సరం ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవడం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్(ఈఈఈ), ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అండ్ మిషన్ లెర్నింగ్(సీఎస్ఎం), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డేటా సైన్స్(సీఎస్‌డీ) బ్రాంచ్‌లను అందుబాటులో ఉంచారు. ఒక్కో బ్రాంచ్‌లో 66 సీట్లు కాగా, మొత్తం 396 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఏడాదికి రూ.70వేలు ఫీజును నిర్ణయించారు.

ఆయిల్‌పామ్ కంపెనీకి మండలాల కేటాయింపు రద్దు

- కార్యకలాపాలు మొదలు పెట్టకపోవడమే కారణం

తిరుపతి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్ పామ్ పంట అభివృద్ధి కోసం ఓ కంపెనీకి కేటాయించిన రెండు మండలాలను ప్రభుత్వం తాజాగా రద్దు చేసింది. ఆ కంపెనీ ఎలాంటి కార్యకలాపాలూ చేపట్టకపోవడమే దీనికి కారణం. ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించిన పూర్వాపరాలిలా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఆయిల్ పామ్) ప్రోగ్రామ్ కింద 2021-22 నుంచీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేపడుతోంది. 2021-22 నుంచీ 2025-26 వరకూ 1.12 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని లక్ష్యం నిర్దేశించింది. రాష్ట్రంలో 4 జిల్లాలకు చెందిన 24 మండలాలను ఎంపిక చేసింది. అందులో భాగంగా గతేడాది మార్చిలో తిరుపతి జిల్లాలో నాగలాపురం, నారాయణవనం మండలాలను మెస్సర్స్ ఏఎంఆర్ ఆగ్రో ఫార్మ్స్ లిమిటెడ్ అనే కంపెనీకి కేటాయించింది. ఈలోపు 2025-26 సంవత్సరానికి కేంద్రం అదనంగా మరో 50 వేల హెక్టార్లు లక్ష్యం విధించింది. అయితే 2025-26లో నారాయణవనం, నాగలాపురం మండలాల పరిధిలో ఏఎంఆర్ ఆగ్రో ఫార్మ్స్ లిమిటెడ్ సంస్థ ఆయిల్ పామ్ పంట అభివృద్ధి దిశగా చేసిందేమీ లేదని రాష్ట్ర హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ గుర్తించారు. ఈ విషయాన్ని ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ సంస్థకు రెండు మండలాల కేటాయింపును రద్దు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి మూడు రోజుల జైలు

- 15 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యంతాగి వాహనాలు నడిపిన కేసుల్లో ఆరుగురికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి కథనం మేరకు.. తిరుపతిలో ఐదారు నెలలుగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై తనిఖీలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన మందుబాబులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. వీరిలో ఆరుగురికి మూడు రోజుల జైలు శిక్ష.. మరో 15 మందికి రూ.10,000 వంతున రూ1.50 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రుయాలో గుండె పోటుతో వైద్యుడి మృతి



డాక్టర్ నరేంద్ర (ఫైల్ ఫొటో)

తిరుపతి(వైద్యం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వార్డులో రోగులను పరీక్షించిన వైద్యుడు.. బయటకు వస్తూనే కుప్పకూలారు. గుండె పోటుకు గురై మృతిచెందారు. ఈ విషాద ఘటన తిరుపతిలోని రుయాస్పత్రిలో సోమవారం చోటుచేసుకుంది. జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్ర(55) సోమవారం మధ్యాహ్నం వరకు వార్డులో పలువురు రోగులను పరీక్షించారు. మరో వార్డులో రోగులను పరీక్షించేందుకు వెళుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆస్పత్రి ఆవరణలోనే కుప్పకూలారు. వెంటనే వైద్య విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆయన్ను పక్కనే ఉన్న అత్యవసర విభాగానికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం స్విమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. ఈయన స్వగ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. ఇటీవలనే నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బదిలీపై రుయాస్పత్రికి వచ్చారు. ఆయన మృతికి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధతో పాటు పలువురు వైద్య విభాగాధిపతులు సంతాపం తెలిపారు.

రిజిస్ట్రేషన్‌తోనే ఆస్తి మీపేరిట

- 1నుంచి తిరుపతిలో ఆటో మ్యుటేషన్ అమలు

తిరుపతి, జూలై28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఏదైనా స్థలం లేదా ఇల్లు కొనుగోలు చేసి, ఆ ఆస్తి మీపేరిట మార్చుకునేందుకు కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారా? రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానంలో ఈ సమస్య ఉండదు. రిజిస్ట్రేషన్ తర్వాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు.. ప్రాపర్టీ టాక్స్ రికార్డులో ఆటోమేటిక్‌గా చేరతాయి. డిజిటల్ డేటా ఆధారంగా పారదర్శకతతో కూడిన సేవలు అందుబాటులోకి వస్తాయి. పట్టణ ప్రాంతాల్లో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మ్యుటేషన్ చేయించుకోవడంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ 'అర్బన్ ఆటో మ్యుటేషన్' ప్రక్రియను ఆగస్టు 1నుంచి అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ విధానం వల్ల దాన విక్రయ, పరివర్తన, దస్తావేజుల రిజిస్ట్రేషన్ ద్వారా ఆస్తి పూర్తిస్థాయిలో బదలాయింపు అయిన వెంటనే కొనుగోలుదారు పేరిట మ్యుటేషన్ జరిగిపోతుంది. ఆస్తిపన్ను, యాజమాన్య వివరాలను ప్రాపర్టీట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నెంబరు (పీటీఐఎన్) ఉపయోగించి సీడీఎంఏతో అనుసంధానం చేస్తారు. సాధారణంగా మున్సిపాల్టీలలో మ్యుటేషన్ ప్రక్రియ 15 నుంచి 30 రోజులు లేదా అంతకంటే ఎక్కువ రోజులు పడుతుంది. సీడీఎంఏ డేటా బేస్ నుంచి పీటీఐఎన్ ఉపయోగించి ఆస్తి వివరాలను నేరుగా పొందడం ద్వారా మ్యుటేషన్ సులభతరమవుతుంది. ఆటోమ్యుటేషన్ ఫీజు ఆస్తి విలువను బట్టి ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా లెక్కిస్తారు. తద్వారా మధ్యవర్తులతో సంబంధంలేకుండా పోతుంది. ఆస్తివివరాలు, పన్ను బకాయిలు, యాజమాన్య రికార్డులు ఖచ్చితంగా ఉంటాయి. తప్పు డోరు నెంబరు వంటి లోపాలను కూడా గుర్తిస్తుంది. తప్పు రికార్డుల వల్ల జరిగే వివాదాలను తగ్గిస్తుంది. ఎస్ఎంఎస్ నోటిఫికేషన్లు, ఆన్‌లైన్ స్టేటస్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు వివరాలను అందిస్తుంది.

పల్లెల్లో 'స్వచ్ఛ రథం'

- ప్రయోగాత్మకంగా తిరుపతి రూరల్‌లో రెండు పంచాయతీల ఎంపిక
- వచ్చే నెల 15నుంచి అమలుకు శ్రీకారం



గుంటూరులో అమలవుతున్న స్వచ్ఛరథం

తిరుపతిరూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చెత్తపై పన్ను వేస్తే.. కూటమి ప్రభుత్వం పొడి చెత్తకు సరుకులిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తడి, పొడి చెత్తలని వేరుచేయడం క్లిష్టతరంగా మారిన తరుణంలో గ్రామాల్లో శుభ్రతతోపాటు ప్రజలకు ఆదాయమూ సమకూరేలా పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ రథం' కార్యక్రమం చేపట్టింది. ప్రయోగాత్మకంగా తిరుపతి రూరల్ మండలంలోని రెండు పంచాయతీల్లో ఆగస్టు 15 నుంచి అమలు చేయనుంది. ఇప్పటికే గుంటూరుజిల్లాలోని రూరల్‌మండలంలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేశారు. ఇది విజయవంతం కావడంతో ఇక్కడా అమలుకు చర్యలు చేపట్టారు.

ఎండీయూ వాహనాల వినియోగం

స్వచ్ఛ రథం కోసం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) వాహనాలను వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. సాధారణంగా గ్రామాల్లో కొందరు పాతసామాన్లకు ఉల్లిపాయలు, బెల్లం వంటి వస్తువులను ఇస్తామంటూ ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తిరిగి సేకరిస్తుంటారు. దీన్ని ఒక సిస్టమాటిక్‌గా ప్రభుత్వమే చేపట్టనుంది. ప్రతిఫలంగా వారికి పొడిచెత్త బరువును బట్టి సరుకులు ఇస్తే బాగుంటుందన్న సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమానికి చేపట్టింది.



పాత సామాన్లు తీసుకుని నిత్యావసర సరుకులు ఇస్తున్న నిర్వాహకులు

ఇందులో భాగంగా స్వచ్ఛరథం వాహనాలు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలనుంచి రీసైక్లింగ్ వ్యర్థాలను (ప్లాస్టిక్ బాటిళ్లు, నీళ్లబాటిళ్లు, బ్యాగులు, అట్టపెట్టెలు తదితరాలు) సేకరించి.. దానికి ప్రత్యామ్నాయంగా వారికి ఇంటికి వాడుకునే నిత్యావసరాలను (వేరుశనగ, కందిపప్పు, కొబ్బరి నూనె, సేమియా, ఉల్లిపాయలు, టీపొడి, సోపులు తదితరాలు) అందించనున్నారు. ఇంటి వద్దకే వచ్చి ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను తూకంవేసి రేటు నిర్ణయిస్తారు. దాని ప్రకారం నిత్యావసర సరుకులను తీసుకోవచ్చు.

రెండు వాహనాలను సిద్ధం చేస్తున్నాం

మండలంలోని రెండు పంచాయతీల్లో ఆగస్టు 15 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి రెండు ఎండీయూ వాహనాలను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే పెరుమాళ్లపల్లె పంచాయతీని ఎంపిక చేశాం. ఉన్నతాధికారులతో మాట్లాడి మరొకటి ఎంపిక చేస్తాం. ఈ వాహనాలు గ్రామాలకు వెళ్లి పునరుద్ధరించే పొడిచెత్తని సేకరించి నిత్యావసర సరుకులు అందించనున్నారు. దీనివల్ల గ్రామాల పరిశుభ్రతతోపాటు ఎండీయూ వాహనాల యజమానులకు ఉపాధీ లభించనుంది.

- కె.దయాసాగర్, డిప్యూటీ ఎంపీడీవో

చంద్రగిరి

పర్యాటక అభివృద్ధికి తోడ్పడండి

● మంత్రి కందుల దుర్గేష్‌కు జనసేన నేత దేవర మనోహర్ వినతి



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దేవర మనోహర్

చంద్రగిరి, జూలై 28(ఆంధ్ర జ్యోతి): చంద్రగిరి నియోజక వర్గంలో పర్యాటక రంగం అభివృద్ధికి తోడ్పాటును అందించాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ వినతిపత్రాన్ని అందజేశారు. తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రిని సోమవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ దేశవిదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తిరుమల శ్రీవారి దర్శనం కోసం వస్తుంటారని, తిరుపతికి అతిదగ్గరలో ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో పర్యాటక ప్రదేశాలలో సరైన వసతులు లేక పర్యాటకులు వెనుదిరుగుతున్నారని చెప్పారు. తిరుచానూరులో పద్మావతి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని అక్కడి నుంచి రాయలచెరువు, చంద్రగిరికోట, శ్రీవారిమెట్టు, శ్రీనివాసమంగాపురం, కళ్యాణిడ్యామ్, తలకోన ప్రాంతాలను సందర్శించుకొనేందుకు టూరిజం బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి వలన ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పర్యాటక అభివద్ధికి సహకరిస్తానని భరోసా ఇచ్చినట్లు మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివర్తి లక్ష్మీభారతికి మంత్రి నివాళి



లక్ష్మీభారతి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాకాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నాని మాతృమూర్తి పులివర్తి లక్ష్మీభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి నిమ్మల రామానాయుడు నివాళులు అర్పించారు. సోమవారం పులివర్తి వారిపల్లెలో ఎమ్మెల్యే పులివర్తి నానిని, కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి కూడా లక్ష్మీభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాని కుటుంబసభ్యులను పరామర్శించారు.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం



బలిజపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి సుగుణ అన్నారు. మండలంలోని బలిజపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రాయలచెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడు త్యాగరాజులు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పేదల అభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రరాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. జగన్ పాడు చేసిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాయలచెరువు నీటిసంఘం ఉపాధ్యక్షుడు త్యాగరాజులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

రామచంద్రాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రామాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తులకు సోమవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. మహాభారత ఉత్సవాలు ముగిసిన మరుసటిరోజు వివిధ సేవల్లో అలసిన దేవతామూర్తులకు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. రాత్రి వివిధ రకాల పుష్పాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. వేదికపై కొలువు దీర్చిన ద్రౌపదీ సమేత ధర్మరాజులకు శాస్త్రోక్తంగా అర్చకులు పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదాతలు శంకర్‌రెడ్డి, ప్రమీల దంపతులు పాల్గొన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారు: టీడీపీ



టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్

భాకరాపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అధికారులు, పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని చిన్నగొట్టిగల్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ అన్నారు. సోమవారం చిన్నగొట్టిగల్లులో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారులు, పోలీసులు పక్షపాతంగా వ్యవహరించి వైసీపీ శ్రేణులపై కేసులు పెడుతున్నారని ఒక పత్రికలో రాశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జంగావాండ్లపల్లె పంచాయతీలో ప్రతాపరెడ్డి, కృష్ణారెడ్డి, బాలకృష్ణ అనే రైతులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పాల్జేశారని ఆయన ఆరోపించారు. ఇటీవల దీన్‌దార్లపల్లెలో, మారసానివారిపల్లెకు చెందిన రైతులపై వైసీపీ శ్రేణులు దాడి చేస్తే బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారని చెప్పారు. టీడీపీ వారు ఎక్కడా కూడా దాడులు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే వారిపై అక్రమంగా కేసులు పెట్టించారని విమర్శించారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి



చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చంద్రగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురం రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని శ్రీనివాసమంగాపురం రైల్వే గేటు సమీపంలో చెట్టు గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడని సమాచారం అందడంతో ఎస్‌ఐ అనిత తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పది రోజుల క్రితం 20 అడుగుల ఎత్తులో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, దుర్వాసన వెదజల్లుతుందని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి వద్ద ఇతర ఏ ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



పారిశుధ్య కార్మికులకు యూనిఫాం అందిస్తున్న సర్పంచ్ తదితరులు

తిరుపతి రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సోమవారం యూనిఫాం, బూట్లు పంపిణీ చేశారు. గ్రామ సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డితో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి తదితరులు కలసి అందజేశారు. ఈసందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో కార్మికులకు జీతాలు పెంచామని, ఏడాదికోసారి యూనిఫాం, సోపులు తదితర వాటిని అందిస్తున్నామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా

చంద్రగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, కొటాల మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఏకం యూఎస్‌ఏ వారి ఆర్థిక సహకారంతో సోషియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ(సిర్డ్) ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులకు సోమవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిర్డ్ సంస్థ ప్రధాన కార్యదర్శి మరుపూరి హేమ శేఖర్, కొటాల గ్రామపంచాయతీ టీడీపీ అధ్యక్షులు విష్ణు, వార్డు మెంబర్ మల్లికమ్మ, ఉపాధ్యాయులు రాజేంద్ర, వెంకట్ నాగులు, లక్ష్మీనారాయణ, సరస్వతమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



కొటాలలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చంద్రగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, కొటాలలో తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొటాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఈ పరీక్షలు నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, ఎంపీటీసీ మధు, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధ, మల్లిక, హేమశేఖర్, విష్ణు, మునిశేఖర్, ఎంపీహెచ్‌ఈవో ఈశ్వరయ్య, సీహెచ్‌వో వెంకటమ్మ, పీహెచ్‌ఎన్ చింతామణి, ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరికీ సరిపడా యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

భాకరాపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు అయ్యే పంటలకు సరిపడా యూరియా పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారిణి ధనలక్ష్మి తెలిపారు. చిన్నగొట్టిగల్లు రైతు సేవా కేంద్రంలో రైతులకు సోమవారం యూరియా పంపిణీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మండలంలోని ప్రైవేటు షాపులు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా స్టాకు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఉన్నతాధికారులను సంప్రదించి ఆర్డర్ పెట్టడంతో ప్రస్తుతం 300 బస్తాలు యూరియా వచ్చిందన్నారు. ప్రతి రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ స్టాక్ అయిపోగానే మరలా యూరియా వస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. పంటలకు ఎక్కువ మోతాదులో యూరియా వాడరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్, ఆర్వీ రమణారెడ్డి, సర్పంచ్ మనోహర, బెల్లంకొండ రమణ, సురేంద్ర నాయుడు, రైతులు పాల్గొన్నారు.

తిరుమలలో హోటళ్ల టెండర్ల ప్రక్రియ మొదలు

తిరుమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ హోటళ్ల టెండర్ ప్రక్రియ సోమవారం మధ్యాహ్నం మొదలైంది. ఐదు బిగ్ క్యాంటీన్ల ఓపెన్ టెండర్ల ప్రక్రియను టీటీడీ ఎస్టేట్ విభాగం, విజిలెన్స్, హెల్త్ విభాగం అధికారులు ప్రారంభించగా టెండర్లు వేసిన పలువురు హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు. అయితే అర్ధరాత్రి అయినప్పటికీ టెండర్ల ప్రకియ కొనసాగడం గమనార్హం. మంగళవారం ఉదయానికి టెండర్లను ఖరారు చేస్తామని అధికారులు తెలిపారు. ఇక, తిరుమలలో బ్రాండెడ్ హోటళ్లు మాత్రమే ఉండేలా టీటీడీ కొన్ని నిబంధనలను పెట్టిన విషయం తెలిసిందే. అయితే కొన్ని నిబంధనలను సడలించినట్టు సమాచారం.

అభివృద్ధి పనులు పారదర్శకంగా పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే పులివర్తి నాని



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను సకాలంలో పారదర్శకంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సోమవారం మండలంలోని ఆదెనపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, డీఎల్‌పీవో సురేష్ నాయుడు, నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, ఈవో ఆర్డీలతో సమావేశమయ్యారు. ఆయా గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి పన్నులు వసూలు చేసి పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తిరుచానూరులో తాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తన పల్లె క్రాస్ నుంచి మామిడికాయల మండీల వరకు రోడ్డు, డ్రైనేజి నిర్మాణాలు, విద్యుత్ లైన్‌ల ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాకాల మండల దామలచెరువు రైల్వే బ్రిడ్జి వద్ద వర్షపునీరు నిలువకుండా చర్యలు చేపట్టాలన్నారు. పీ-4 సర్వే చేసి బంగారు కుటుంబాలను గుర్తించి, వారి దత్తతకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. పంచాయతీలు ఆదర్శంగా అభివృద్ధి చేయడానికి అధికారులు సహకరించాలన్నారు.

తిరుమలలో ఆండాళ్ తిరువడిపురం శాత్తుమొర





పొగడమాను వద్ద హారతులు - ఉత్సవర్ల ఊరేగింపు

తిరుమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం ఆండాళ్ తిరువడిపురం శాత్తుమొర వైభవంగా జరిగింది. సాయంత్రం సహస్ర దీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని పురుశైవారితోటకు వేంచేపు చేశారు. అక్కడ నివేదనల అనంతరం స్వామి, అమ్మవార్లు బయల్దేరి పొగడ చెట్టు వద్దకు రాగానే హారతి సమర్పించారు. శేష హారతి, పుష్పమాల, శఠారి పొగడ చెట్టుకు ఇచ్చారు. శఠారికి అభిషేకం అనంతరం తిరిగి తిరుచ్చిపై ఉంచారు. అక్కడి నుంచి ఉత్సవమూర్తులను తిరిగి శ్రీవారి ఆలయానికి వేంచేపు చేశారు. ఈకార్యక్రమంలో పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదారు హిమంతగిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణోత్సవాలకు విధివిధానాలను రూపొందించండి



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీవారి కల్యాణోత్సవాలను మరింత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు విధివిధానాలను రూపొందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఈవో సమీక్షించారు. ఈ కల్యాణోత్సవాలను వ్యాపార దృక్పథంతో కాకుండా భక్తిభావంతో నిర్వహించేలా సంస్థలు, నిర్వహణ వ్యక్తుల ఎంపిక, ఏ ప్రాంతంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు, ఆర్థిక, న్యాయపరమైన తదితర అంశాలపై ముందుగా ఎంవోయూ చేసుకునేలా నియమావళిని రూపొందించాలన్నారు. ఇప్పటికే ఏపీ ఎన్‌ఆర్టీ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలను విదేశాల్లో నిర్వహిస్తున్న క్రమంలో ప్రణాళికబద్ధంగా శ్రీనివాస కల్యాణోత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విదేశాల్లో కల్యాణోత్సవాల్లో చేయాల్సిన పనులు, చేయరాని పనుల జాబితాను రూపొందించాలన్నారు. తిరుమలలో వ్యర్థాల నిర్వహణపై సమీక్ష నిర్వహించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సీఈ సత్యనారాయణ, డీపీపీ సెక్రటరీ శ్రీరామ్ రఘునాథ్, డిప్యూటీఈవోలు గోవిందరాజన్, సోమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుచానూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆగస్టు 8న నిర్వహించనున్న వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఏర్పాట్లపై ఆలయ ఆస్థాన మండపంలో సోమవారం అధికారులతో సమీక్షించారు. ఆగస్టు 8న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్థాన మండపంలో వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.వెయ్యి చెల్లించి భక్తులు వ్రతంలో భక్తులు పాల్గొనవచ్చునని వెల్లడించారు. కంకణాలు, గాజులు, కుంకుమ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి కోసం..!

● ఎస్వీయూ ఇంజనీరింగ్ సెక్షన్ ఉద్యోగుల మధ్య ఘర్షణ.. పోలీసులకు ఫిర్యాదు



గాయపడిన శ్రీనివాసరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజనీరింగ్ సెక్షన్‌లో పదోన్నతి విషయంలో ఇద్దరు ఉద్యోగుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఇంజనీరింగ్ సెక్షన్‌లో శ్రీనివాసరావు, సుబ్రమణ్యం మధ్య కొంత కాలంగా పదోన్నతి, ఆర్థిక లావాదేవీల విషయంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. యూనివర్సిటీలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. యూనివర్సిటీలోని అసోసియేషన్ సమావేశానికి వెళ్లి శ్రీనివాసరావు తిరిగి వస్తుండగా, కార్యాలయం ఆవరణలో బయట చెట్టు కింద ఉన్న సుబ్రమణ్యం తనకు డబ్బులు ఇవ్వాలని నిలదీశారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. సుబ్రమణ్యం రాయితో శ్రీనివాసరావును రాయితో కొట్టారు. దీంతో తలకు గాయం అయ్యింది. దీనిపై శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన శ్రీనివాసరావు ప్రస్తుతం రూయాలో చికిత్స పొందుతున్నారు. తనకు రావలసిన డబ్బులు అడిగితే శ్రీనివాసరావే తనపై దాడి చేశారని సుబ్రమణ్యం తెలిపారు.

జిల్లా పర్యాటకాభివృద్ధిపై 7, 8 తేదీల్లో తిరుపతిలో సమావేశాలు

తిరుమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాబోవు రోజుల్లో తిరుపతి పరిసర ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకమైన కార్యాచరణను ఏర్పాటు చేయనున్నట్లు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. దీనికి సంబంధించి వచ్చేనెల 7, 8 తేదీల్లో తిరుపతిలో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుమల శ్రీవారి కల్యాణోత్సవం సేవలో సోమవారం పాల్గొన్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న వివిధ క్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలను ఒక సర్క్యూట్‌గా తయారు చేసి వాటిలో టూరిజాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనలతో జిల్లా అధికారులు, టూరిజం, దేవదాయ శాఖ అధికారుల బృందంతో సమీక్షిస్తామని వెల్లడించారు. కాగా, దర్శనం అనంతరం ఆయన ఆలయ మాడవీధుల్లో ప్రదక్షిణ చేయడంతో పాటు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు.

జిల్లాదాటి మహిళలకు 'ఉచిత ప్రయాణం'!

● ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్న ఆర్టీసీ ఎండీ

వెంకటగిరి టౌన్/వాకాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని జిల్లా దాటి వర్తింప చేసేందుకు కసరత్తు చేస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు పేర్కొన్నారు. దీని కోసం ఆర్టీసీ రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం శరవేగంగా సన్నాహాలు చేస్తోందన్నారు. వెంకటగిరి, వాకాడు ఆర్టీసీ బస్టాండ్లను, డిపోలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. ఈ క్రమంలో ఎలాంటి లోపాలు లేకుండా ఆర్టీసీ డిపోలను సందర్శిస్తూ ప్రక్షాళన చేస్తున్నామన్నారు. 750 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరయ్యాయన్నారు. మరో 600 బస్సులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేందుకు చూస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11వేల ఆర్టీసీ బస్సులకు గాను 8 వేల బస్సుల్లో మహిళలు ప్రయాణించేందుకు సుమారు 74 శాతం బస్సులలో ఉచిత ప్రయాణం చేసేలా ప్రయత్నిస్తున్నామన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలోనూ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుందన్నారు.

యువతి వెంట పడుతున్న యువకుడికి దేహశుద్ధి

రేణిగుంట జూలై 28(ఆంధ్రజ్యోతి); యువతి వెంట పడుతున్న యువకుడిని యువతి బంధువులు చితకబాదారు. ఈ ఘటన తిరుపతి - రేణిగుంట మార్గంలోని పారిశ్రామికవాడలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తూకివాకం పంచాయతీలోని ఓ యువతి తిరుపతిలోని ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. ఆటోనగర్‌లో ఉన్న ఓ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న ఓ యువకుడు నెల రోజులుగా యువతి కళాశాలకు వెళ్లే సమయంలో వెంట పడేవాడు. ఈ విషయాన్ని యువతి ఇంట్లో తెలిపింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆ యువకుడి కోసం కాపు కాచారు. యువతి వెనకాల ద్విచక్ర వాహనంలో వస్తున్న యువకుడిని చితకబాదారు. గాయపడిన ఆ యువకుడిని గాజులమండ్యం పోలీసులు ఆస్పత్రికి తరలించారు.



వెండి ఆభరణాలను వితరణ చేస్తున్న దాత

గుడిమల్లం ఆలయానికి వెండి ఆభరణాల వితరణ

ఏర్పేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం ఆలయానికి రూ.8.20లక్షలు విలువ చేసే 6,300 గ్రాముల వెండి ఆభరణాలను ఆదివారం పాకాలకు చెందిన తులసీగోమాత ట్రస్టు ప్రతినిధులు అందజేశారు. వాటిని ఈవో రామచంద్రారెడ్డి స్వీకరించారు. ఈవో, అర్చకులు వంశీకృష్ణశర్మ వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు మాజీ చైర్మన్ గిరినాయుడు, పూర్వ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి ట్రెండ్!



ఒకప్పుడు సమాజాన్ని ప్రభావితం చేసిన నేతల బొమ్మలతో యువత టీ షర్టులు వేసుకునేవారు. ఆ తర్వాత కొటేషన్లు.. క్రమేణా తమ అభిమాన సినీ హీరోలు, రాజకీయ నేతల చిత్రాలతో టీ షర్టులు ధరిస్తూ వచ్చారు. ఇలా తమ అభిమానం చూపుకొనే వారు. మరిప్పుడు గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ ఫొటోతో కూడిన టీ షర్టులు ధరిస్తుండటం జనాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ఇలా.. సోమవారం తడలోని శివాలయానికి ఓ భక్తుడు వీరప్పన్ ఫొటోతో ఉన్న టీషర్టు వేసుకుని రావడంతో 'ఇదేమి ట్రెండ్' అంటూ చర్చనీయాంశంగా మారింది. ఈ టీషర్టు రూ.300 అని, చెన్నైలో వీటికి మంచి డిమాండ్ ఉందంటూ ఆ యువకుడు చెప్పడం గమనార్హం.

- తడ, ఆంధ్రజ్యోతి

షార్‌లో పలు ప్రాజెక్టుల ప్రారంభం

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో రూ.486.22 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న పలు ప్రాజెక్టులను సోమవారం ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ప్రారంభించారు. సాలీడ్ ప్రొపెల్లెంట్ ప్లాంట్ అగ్మెంటేషన్ (ఎస్‌పీపీఏ), 10 టన్నుల మిక్సర్ ప్లాంట్, కెమికల్ టెస్టింగ్ ల్యాబ్, విద్యుత్ ఉపకేంద్రం, ఆధునికీకరించిన పరిపాలన భవన సముదాయాలను ప్రారంభించారు. సూళ్లూరుపేట సమీపంలోని షార్ ఉద్యోగుల కాలనీలో నూతనంగా నిర్మించనున్న క్వార్టర్స్ భవనాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ప్రాభవం.. గోదాదేవి వైభవం

ఆద్యంతమూ ఆకట్టుకున్న గోదాంకితావధానం


గోదాంకితావధానం నిర్వహిస్తున్న మేడసాని మోహన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో శ్రీమన్నారాయణుడి ప్రాశస్త్యాన్నీ, ఔన్నత్యాన్నీ భక్త లోకానికి తెలపడం కోసం అవతరించిన వ్యక్తి గోదాదేవి. ఆమె అవరోత్సవం సందర్భంగా పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ నిర్వహించిన గోదాంకితావధానం ఆద్యంతమూ ఆకట్టుకుంది. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ - శ్రీకృష్ణ దేవరాయ సత్సంగ్ సంయుక్తంగా సోమవారం గోదాంకితావధానం చేపట్టాయి. సావేరీ సెమినార్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఇమ్మని దీపా వెంకట్ మాట్లాడుతూ సాహిత్య రంగానికి మేడసాని మోహన్ చేస్తున్న కృషిని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలను మరింత సులభరీతిలో నిర్వహిస్తే రాబోయే తరాలు ఆసక్తి చూపే అవకాశముందని అభిప్రాయపడ్డారు. వీసీ వెన్నం ఉమ మాట్లాడుతూ తెలుగు భాష పట్ల మేడసాని మోహన్‌కున్న పట్టును ప్రశంసించారు. గోదాంకితావధానం తమ యూనివర్సిటీ ప్రాంగణంలో చేపట్టడం ఆనందదాయకమన్నారు. ఆచార్య తమ్మారెడ్డి నిర్మల మాట్లాడుతూ మేడసాని మోహన్ తనకు విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ శ్రీవారిని కీర్తిస్తూ గోదాదేవి గానం చేసిన పాశురాలు, తిరుప్పావై రచన గొప్పవన్నారు. ధనుర్మాసంలో రోజుకొక పాశురం చొప్పున వైష్ణవాలయాలలో ఆలపించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. అనంతరం పృచ్ఛకులు అడిగిన ప్రతి ప్రశ్నకూ తనదైన రీతిలో పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ సమాధానాన్ని పద్య రూపంలో ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పలువురు సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణ, రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి, నిక్ సీఈవో నాగభూషణం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని మంగళం రూరల్స్, నార్త్, అవిలాల సెక్షన్లలో 33-11 కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతులు కారణంగా మంగళ వారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ చిన్నకోటి చంద్ర శేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ, గంగాదేవి కాలనీ, వరదరాజనగర్, కేటీ రోడ్డు, కేసీ పేట, దుర్గసముద్రం, వడ్డిపల్లి, ఎ.డి.ఆర్.పల్లి, భాగ్య నగరం, కుంట్రపాకం, ఎస్.టి.ఎన్.పల్లి, చిగురువాడ, పీఎస్ఎన్ గార్డెన్, కేబీఆర్ నగర్ సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాంగ్‌రూట్‌లో ఆర్టీసీ బస్సులు


బస్టాండు నుంచి గరుడ వారధిపై రాంగ్‌రూట్‌లో వెళుతున్న బస్సు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 28(ఆంధ్రజ్యోతి): గరుడ వారధిపై ఆర్టీసీ బస్సులు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ ఇతర వాహనాలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సెంట్రల్ బస్టాండు నుంచి బస్సులు డీపీటీవో కార్యాలయం ముందున్న అవుట్ గేటు మీదుగా ప్రయాణించాల్సి ఉంది. కొందరు డ్రైవర్లు ట్రాఫిక్‌ను తప్పించుకునేందుకు గరుడ వారధి ల్యాండింగ్ రూట్ నుంచి అడ్డదారిలో వెళుతూ ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

జనవాణిలో వినతుల స్వీకరణ



తిరుపతి అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను పరిశీలించి, ఆయా విభాగాల అధికారులకు చేరవేశారు. కొన్నింటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి, బోయ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్ తోళ్ల మంజునాథ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శివ, నగరాధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్ క్లాస్ లీడర్ ఎన్నిక


ఓటు వేస్తున్న విద్యార్థినులు

తిరుపతి(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముత్యాలరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్నికలను సోమవారం బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. 7వ తరగతి క్లాస్ లీడర్లను ఎన్నుకున్నారు. పలువురు విద్యార్థులు పోటీపడగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయోగాత్మకంగా బ్యాలెట్ విధానంలో పోలింగ్ నిర్వహించినట్లు హెచ్ఎం హరినాథ్‌రెడ్డి తెలిపారు. పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు సి.సురేష్, క్లాస్ టీచర్ డేగల మహేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు మునికృష్ణ, యోగనాథ్ పర్యవేక్షించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి


ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న సుగుణమ్మ తదితరులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీ కార్పొరేషన్ చైర్మన్ మన్నూరు సుగుణమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. పలు సమస్యలపై చర్చించారు. తనకు ప్రతిపక్ష నాయకుల నుంచి ముప్పు ఉందని, గన్‌మ్యాన్ సౌకర్యం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎస్పీ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దంపూరు భాస్కరయాదవ్, రాష్ట్ర నాయకులు బుల్లెట్ రమణ, నగర అధ్యక్షుడు చినబాబు, రాజారం, చరణ్, రేవతి, గంగులయ్య ఆమె వెంట ఉన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందిన ఘటన అలిపిరి పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ అజిత వివరాల మేరకు.. విజయపురం మండలం మిట్టకండిగకు చెందిన కృష్ణయ్య(55) తిరుపతిలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కపిలతీర్థం సమీపంలోని ఆర్చి వద్ద తిరుపతి అటవీ శాఖ రేంజర్ చలపతి చేపట్టిన షెడ్డు నిర్మాణ పనులకు వెళుతున్నాడు. గోడలకు నీరు పట్టి బోరు ఆపే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అలిపిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్‌కు 45 వినతులు


వినతులు తీసుకుంటున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై28(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 45 వినతులు వచ్చాయి. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కోరారు. రోడ్లలో వాహనాల పార్కింగ్ అరికట్టాలని, గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ వద్ద వ్యర్థాలు తొలగించాలని కార్పొరేటర్ ఎస్కే బాబు కోరారు. భవానీనగర్‌లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పెద్ద గుంత పూడ్చాలని, భూగర్భ డ్రైనేజీ కాలువల ఓవర్ ఫ్లో అరికట్టాలని, మసీదు వీధిలోని చెత్త కుప్పలు తొలగించాలని, లీలామహల్ నుంచి కరకంబాడీ మార్గంలో వీధి దీపాలు వెలిగించాలని, గంగమ్మ గుడి మార్గంలో కాలువలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. గిరిపురంలో వేసిన బోర్‌కు మోటర్ బిగించాలని, బైరాగిపట్టెడలో సెట్‌బ్యాక్ లేకుండా జరుగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, వెంకటరెడ్డి కాలనీలో పగిలిన పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసికుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర పాల్గొన్నారు.

పారదర్శకంగా బంగారు కుటుంబాల ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై28(ఆంధ్రజ్యోతి) : బంగారు కుటుంబాల ఎంపిక పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శి ఎంపికపై సోమవారం కచ్చపి ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పీ4 సర్వేలో ఎంపిక చేసిన, తొలగించిన వారి వివరాలను రికార్డు చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు సాయం అందించే మార్గదర్శకులను కూడా ఎంపిక చేయాలని సూచించారు. నగరంలో పారిశుధ్యం మరింత మెరుగ్గా చేపట్టాలని పారిశుధ్య విభాగ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు. ముఖ్యంగా ఖాళీ స్థలాలకు పన్నులు వేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, మార్గదర్శకులైన అమరరాజా సంస్థ, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్, తిరుపతి మొబైల్స్ అసోసియేషన్ సభ్యులు, కాంట్రాక్టర్లు, హోటల్స్ యాజమాన్యం, నర్సింగ్ హోమ్ అసోసియేషన్ సభ్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తిరుపతి ఇంజనీరింగ్ అండ్ ప్లానర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మార్గదర్శకులు పాల్గొన్నారు.

సద్గమయ శిక్షణ తరగతుల ప్రారంభం


పుస్తక ప్రసాదాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీరామ్ రఘునాథ్, వెంకట సునీల్ - పాల్గొన్న ఎస్‌జీఎస్ విద్యార్థినులు

తిరుపతి(విద్య), జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో భక్తిభావం, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించే ఉద్దేశంతో టీటీడీ విద్యాసంస్థల్లో సద్గమయ శిక్షణా తరగతులను ప్రారంభించినట్లు డీపీపీ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, టీటీడీ డీఈఓ వెంకట సునీల్ పేర్కొన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఈ తరగతులను ప్రారంభించిన అనంతరం ఎస్‌జీఎస్ ఉన్నత పాఠశాలలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు భగవద్గీతను పరిచయం చేసి, భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు మానవీయ కోణం, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం అంశాలకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా అంశాల్లో క్విజ్ పోటీలు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈనెల 31వ తేదీన విద్యార్థులందరికీ సంబంధిత అంశాలపై పుస్తక ప్రసాదాన్ని అందించనున్నట్లు చెప్పారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని ఉన్నతి సాధించాలని సూచించారు.

ఘనంగా ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర


ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు - అలిపిరి నుంచి ఊరేగింపుగా బయల్దేరిన అమ్మవారు

తిరుపతి అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ముగింపు సందర్భంగా సోమవారం శాత్తుమొర నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం గోవిందరాజస్వామి, ఆండాళ్ అమ్మవారిని అలిపిరి పాదాల మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థానం, పూజలు చేశారు. అక్కడి నుంచి గీతామందిరం, రామనగర్ క్వార్టర్స్, వైఖానసాచార్యుల ఆలయం, ఆర్ఎస్ మాడవీధి, చిన్నజియ్యర్ మఠం మీదుగా ఊరేగుతూ ఆలయానికి వేంచేశారు. దీంతో తిరువడిపురం ఉత్సవం పరిసమాప్తమైంది. జియ్యంగార్లు, డిప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.

ముద్దుకృష్ణమ కుటుంబంపై రోజా ఆరోపణలు బాధాకరం

- టీడీపీ నేత వినుకొండ సుబ్రహ్మణ్యం


మీడియాతో మాట్లాడుతున్న వినుకొండ సుబ్రహ్మణ్యం తదితరులు

తిరుపతి(జీవకోన), జూలై 28(ఆంధ్రజ్యోతి): దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు కుటుంబంపై మాజీ మంత్రి రోజా ఆరోపణలు బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇనుకొండ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మచ్చలేని నేతగా పేరుతెచ్చుకున్న ముద్దుకృష్ణమ నాయుడిని కించపరిచేలా మాట్లాడిన రోజా క్షమాపణ చెప్పాలన్నారు. ఆయన హయాంలో పుత్తూరు, నగరి ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఆడుదాం ఆంధ్రా, శ్రీవారి దర్శన టికెట్లలో అవినీతికి పాల్పడిన రోజాకు శిక్ష తప్పదని హెచ్చరించారు. టీడీపీ సీనియర్ నేతలు సింగంశెట్టి సుబ్బరామయ్య, అంబూరి సింధుజ మాట్లాడుతూ రోజా నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో లక్ష్మణరావు, ఆముదాల తులసీదాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నేత సౌజన్యకు పరామర్శ



తిరుపతి(ఆటోనగర్), జూలై28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శ్రీకాళహస్తి నాయకురాలు సౌజన్యను సోమవారం సాయంత్రం బర్డ్ ఆసుపత్రిలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కేఎస్ఎన్ ప్రసాదరావు ఆయన వెంట ఉన్నారు.

కమిషనర్‌కు సీపీఎం అభినందనలు

తిరుపతి(ఆటోనగర్), జూలై28: నగర పరిధిలోని సుందరయ్యనగర్, సప్తగిరినగర్, ఏఎస్ఆర్ కాలనీ, మధురానగర్ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించడం పట్ల సీపీఎం నగర నాయకులు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యను అభినందించారు. గతవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో సమస్యల గురించి విన్నవించగా వెంటనే స్పందించి పనులు పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్, నరేంద్ర, జయంతి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


డాక్టర్‌ను సన్మానిస్తున్న మహిళలు

తిరుపతి(ఆటోనగర్), జూలై28 (ఆంధ్రజ్యోతి): చెన్నారెడ్డి కాలనీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన మహిళలకు, పిల్లలకు నవభారత్ సేవా సమాజ్ నిర్వాహకులు సోమవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. రుయా చిన్నపిల్లల ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శశికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆహారం తీసుకోవడంలో సమయపాలన పాటించాలన్నారు. పిల్లలకు వయసును బట్టి ప్రొటీన్స్‌తో కూడిన ఆహార పదార్థాలు తినిపించాలని సూచించారు. కౌమారదశ ప్రాముఖ్యత, ఆహారపు అలవాట్లు, పిల్లల పట్ల తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నవభారత్ సేవా సమాజ్ సిబ్బంది లావణ్య, సులోచన, ద్రాక్షాయణి, రజిత, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం

- రెండేళ్లుగా పూర్తికాని పనులు
- పూడి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



తిరుపతి (సెంట్రల్), జూలై28 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట -పుత్తూరు మార్గంలోని పూడి రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. సదరన్ రైల్వేలో చివరి స్టేషన్‌గా ఉన్న పూడిని జంక్షన్ చేయాలనే ప్రతిపాదన ఉంది. ఆ మేరకు అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ప్రయాణికుల సౌకర్యార్థం రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఇప్పటికీ అతీగతి లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రయాణికులు రెండు, మూడు ప్లాట్‌ఫారాల్లో ఆగే రైళ్లు ఎక్కాలంటే ఒకటో ప్లాట్‌ఫారం నుంచి రైలు పట్టాలు దాటి వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, పిల్లలు అవస్థలు పడుతున్నారు. ఈ రెండు ప్లాట్‌ఫారాల్లో దిగిన ప్రయాణికులు బయటకు వెళ్లడానికి ఇదే పరిస్థితి ఉంటోంది. జోనల్, డివిజన్ కేంద్రాలు దూరంగా ఉండడంతో పర్యవేక్షణ కరువై పనులు ఆలస్యమవుతున్నాయన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా సదరన్ రైల్వే అధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పూర్వ ఒప్పందం పునరుద్ధరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28 (ఆంధ్రజ్యోతి): గతంలో స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో ఆరేళ్ల ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ కోర్సు నిర్వహణపై పద్మావతి మహిళా యూనివర్సిటీ గతంలో చేసుకున్న ఒప్పందాన్ని పునరుద్ధరించారు. 2010లో చేసుకున్న ఈ ఒప్పంద కాల పరిమితి ముగిసింది. దీంతో స్వీడన్ ప్రతినిధి గురుదత్ వేల్పుల, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇంటర్నేషనల్ డీన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలపై విద్యార్థి సంఘాల విన్నపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో విద్యార్థుల సమస్యలపై వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు విద్యార్థి సంఘాలు విన్నవించాయి. పీహెచ్‌డీ సబ్మిషన్ ఫీజు తగ్గించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కాలర్లు విన్నవించారు. పీజీ విద్యార్థులతో బలవంతంగా ఫీజులు వసూలు చేయడం ఆపాలని పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఆశ విన్నవించారు. ప్రభుత్వం నుంచి ఫీజులు మంజూరు కాకనే విద్యార్థులు ఫీజులు కట్టాలని ఒత్తిడి చేయడం సరికాదని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పాదచారి గాయపడిన ఘటన సోమవారం రేణిగుంట రోడ్డులో చోటుచేసుకుంది. కొరమేనుగుంటకు చెందిన వరదారెడ్డి రోడ్డుపై నడుచుకుని వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన రోహిత్ సాయి ద్విచక్ర వాహనంలో వెళుతూ వేగంగా ఢీకొట్టాడు. వరదారెడ్డి ఎడమ కాలిపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.





గోపిచంద్ మలినేని - శివరాజ్ కుమార్

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం సినీ దర్శకుడు గోపిచంద్ మలినేని, కన్నడ నటుడు శివరాజ్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఐటీసీటీఏ పురస్కారం అందుకుంటున్న జిల్లా టూరిజం ఆర్డీ రమణప్రసాద్

ఏపీ టూరిజానికి ప్రతిష్ఠాత్మక అవార్డు

ఇంటర్నేషనల్ టూరిజం కాన్‌క్లేవ్ అండ్ ట్రావెల్ (ఐటీసీటీఏ) సంస్థ ఏపీలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులు, ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలించింది. 'ఎమర్జింగ్ కోస్టల్ అండ్ హెరిటేజ్ అవార్డును' ప్రకటించింది. ఈ అవార్డును శనివారం ఢిల్లీలో ఆ సంస్థ ప్రతినిధుల నుంచి జిల్లా పర్యాటకశాఖ ఆర్‌డీ రమణ ప్రసాద్ అందుకున్నారు. కొన్ని కారణాలతో పర్యాటకఅభివృద్ధి కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి వెళ్లకపోవడంతో తిరుపతి ఆర్డీ రమణ ప్రసాద్ అందుకున్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 85,486

తలనీలాలు సమర్పించినవారు: 30,929





వాకాడు డిపో నమూనాను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ

బస్టాండ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం

- ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

వాకాడు/వెంకటగిరి టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల కోసం కుర్చీలు, ఫ్యాన్‌ల ఏర్పాటుతో సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. వాకాడు, వెంకటగిరిలోని డిపోలు, బస్టాండ్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. వాకాడు డిపో ఆవరణంలో మొక్కలను నాటారు. రెండు చోట్లా డిపో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. మీడియాతో మాట్లాడారు. బస్టాండ్లకు కొత్తగా రంగులు వేస్తున్నామని తెలిపారు. వాకాడు డిపో ఆవరణలో సిమెంట్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయనున్నామన్నారు. అన్ని డిపోలో బస్సు సర్వీసులు ఎలా ఉన్నాయో జోన్ల వారీగా తెలుసుకుని కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో వెంకటగిరి, వాకాడు డిపోలను పరిశీలించి సర్వీసులు, సిబ్బందికి సూచనలు అందించామన్నారు. వెంకటగిరిలో మరో రెండు ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి అత్యాధునిక బస్టాండ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్టీసీ ఎండీ వెంట ఈడీ చంద్రశేఖర్, ఈడీఈ చెంగల్‌రెడ్డి, ఈడీవో అప్పలరాజు, వెంకటగిరి, వాకాడు డీఎంలు రామకృష్ణ, పెంచలయ్య, సిబ్బంది ఉన్నారు.

పులి..జాడ ఎక్కడ?

- శేషాచల అడవుల్లో అంతరిస్తున్న వైనం
- ఎస్వీ జూకే పరిమితం
- నేడు జాతీయ పులుల దినోత్సవం



జూపార్కులో రాయల్‌బెంగాల్ టైగర్

దేశంలో పులుల సంఖ్య	
సంవత్సరం	పులుల సంఖ్య
2006	1,411,
2010	1,726
2014	2,226
2018	2,927
2022	3,682 (అంచనా)

మంగళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పెద్దపులి.. వేటలో రారాజు.. రాజసానికి ప్రతీక. దీనిపేరు వింటేనే జనానికి ముచ్చెమటలు పడతాయి. కదలికలో చురుకుదనం, చూపులో తీక్షణం, గాండ్రింపులో వైవిధ్యమున్న ఈ మృగం ఉనికి నానాటికీ అంతరించిపోతోంది. అభయారణ్యంగా పేరొందిన మన శేషాచల అటవీప్రాంతంలో వ్యాఘ్రం మచ్చుకైనా లేదంటే ఆశ్చర్యం,ఆవేదన కలుగుతాయి. ఇప్పుడు పులులు ఎస్వీ జూకు మాత్రమే పరిమితమయ్యాయి.





జూపార్కులో తెల్ల పులి

చాన్నాళ్లుగా ఉనికే లేదు..

దట్టమైన అడవి పెద్దపులులకు ఆవాసానికి అనుకూలం. అడవుల పరిరక్షణలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. శేషాచల పరిధిలోని ఆహార వనరులు, రాతి గుహలు, సెలయేళ్లు, నీటి గుంటలు పులుల మనుగడకు ఉపకరించేవి. ఈ దృష్ట్యా ప్రభుత్వం ఏడాది క్రితం నల్లమల నుంచి బద్వేల్ మీదుగా శేషాచలం వరకు ప్రత్యేక కారిడార్‌గా ప్రకటించింది. నాలుగు జిల్లాల్లో నాలుగు లక్షల హెక్టార్ల పరిధిలో విస్తరించిన ఈ కారిడార్‌లో చాన్నాళ్లుగా పులి సంచరించిన దాఖలాలు లేవని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఆరేళ్ల క్రితం చామల రేంజ్ అటవీప్రాంతంలో ఓ పెద్దపులిని గుర్తించినా తర్వాత ఉనికి లేదు. తాజాగా నెల్లూరు, కడప జిల్లాల మధ్య పులుల కార్యకలాపాలున్నట్లు భావించినా నిర్ధారణ కాలేదు. నాగార్జునసాగర్-శ్రీశైలం రిజర్వు ఫారెస్ట్‌లో 95 పెద్దపులులున్నాయని అంచనా.



పెద్దపులులు

జూపార్కులో పులుల సందడి

అంతరించిపోతున్న పెద్దపులు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తిరుపతి ఎస్వీ జూపార్కులో రెండు బెంగాల్ టైగర్స్, తొమ్మిది తెల్లపులులు సందర్శకులు కనువిందు చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం తీసుకువచ్చిన నాలుగు పిల్లల్లో రెండు చనిపోయాయి. ఇక్కడి పులులకు రోజూ అర లీటరు పాలు, ఐదు నుంచి 6కిలోల బీఫ్, రెండు కేజీల చికెన్,రెండు కోడిగుడ్లు వంతున ఆహారంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.4,85,4590 ఖర్చవుతుంది. ఈక్రమంలోనే పులులను దత్తత తీసుకుని ఆహారానికి కొంత ఆర్థిక సాయం సమకూర్చాలని జంతు ప్రేమికులకు జూ అధికారులు కోరుతున్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

పరిష్కారం కాని పక్షంలో వివరణ ఇవ్వండి ● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం ● కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు 260 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో దానికి కారణాలు తెలుపుతూ వివరణ ఇవ్వాలని జిల్లా అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి వినతులు సమర్పించారు. కొన్ని అర్జీలకు అక్కడికక్కడే వర్చువల్ విధానంలో కలెక్టర్ పరిష్కారం చూపారు. వివిధ సమస్యలపై మొత్తం 260 అర్జీలు రాగా, అందులో రెవెన్యూ శాఖకు 125 ఉన్నాయి.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

పింఛను కోసం మూడేళ్లుగా తిరుగుతున్నా..



నేను మూడేళ్ల క్రితం మానసిక వైకల్యానికి గురయ్యాను. ప్రభుత్వ వైద్యాధికారులు ధ్రువపత్రం కూడా ఇచ్చారు. మూడేళ్లగా వికలత్వ పింఛను కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతూనే ఉన్నాం. అధికారులు పట్టించుకోవడంలేదు. భార్యతోపాటు ఇద్దరు పిల్లలను పోషించడం కష్టంగా ఉంది. పింఛను మంజూరు చేసి ఆదుకోండి.

- గంగయ్య, టీకేపురం, పిచ్చాటూరు మండలం

గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించండి



నా భర్తకు అనారోగ్యం. నాకు క్యాన్సర్ కారణంగా కాలు తొలగించారు. మా అమ్మాయి పదవ తరగతిలో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ సీటు ఇప్పించండి.

- లక్ష్మి, నాగనందవరం, వరదయ్యపాళెం మండలం

చెరకు రైతుల బకాయిలు చెల్లించండి

మయూర షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు రైతులకు ఆరేళ్లుగా బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హేమలత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రూ.16కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని, షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులు జప్తుచేసి వీలైనంత త్వరగా చెల్లించాలని రైతులతో కలిసి కలెక్టర్‌ను కోరారు.

రోడ్డు ఏర్పాటు చేయండి



మా గ్రామంలో 180 కుటుంబాలున్నాయి. జాతీయ రహదారి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. 50 ఏళ్లుగా డొంక రోడ్డులో ప్రయాణం చేస్తున్నాం. వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రెండు కిలోమీటర్లు తారు రోడ్డు వేశారు. రిజర్వు ఫారెస్టు ఉన్న రెండు కిలోమీట్లరు అలాగే వదిలేశారు. పలుమార్లు అర్జీలు సమర్పించినా పట్టించుకోవడం లేదు. అత్యవసర సమయాల్లో చాలా ఇబ్బంది పడుతున్నామని, రోడ్డు ఏర్పాటు చేయాలని డక్కిలి మండలానికి చెందిన వీకేపై సముద్రం గ్రామ ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.

మా బడి మాకు కావాలి

'మా బడి మాకు కావాలి' అంటూ నారాయణవనం మండలం తుంబూరు హరిజనవాడకు చెందిన విద్యార్థుల తల్లి దండ్రులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. తమ గ్రామంలో 56 మంది విద్యార్థులు ఉండగా పక్క గ్రామంలోని 11మంది విద్యార్థులతో కూడిన పాఠశాలతో విలీనం చేయడం దుర్మార్గమన్నారు. విద్యా సంవత్సరం మొదలై 3 నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు.



తుంబూరు హరిజనవాడవాసుల ధర్నా

వీరికి ఏఐఎస్‌ఎఫ్ నేతలు శివారెడ్డి, ఉదయ్, ప్రవీణ్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు.



పల్లంపేటవాసుల ఆందోళన

మా ఊరిలో 60 మంది పిల్లలు చదువుతున్నారు. వారిని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లం హరిజనవాడ పాఠశాలలో ఎలా విలీనం చేస్తారంటూ ఏర్పేడు మండలం పల్లంపేట వాసులు ప్రశ్నించారు. ఈ మేరకు తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. పిల్లలు జాతీయ రహదారిపై నడచివెళ్లడం ప్రమాదకరమని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల విలీనం ఆలోచనను రద్దు చేయాలని కోరారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం

- అధికారులకు ఎస్పీ ఆదేశం

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ హర్షవర్ధనరాజు అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌కు హాజరైన ప్రజల సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఇందులో 10 ఏళ్ల నాటి సమస్య ఒక్క రోజులో పరిష్కారం కావడంతో అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన వినతులను ఆయా స్టేషన్లకు పంపారు. దాదాపు 100 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రవిమనోహరాచారి, సీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి రూ.కోటి చెక్కు అందజేత

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఎస్ఐ గురుస్వామి కుటుంబానికి ఎస్‌బీఐ ద్వారా బీమా కింద రూ.కోటి చెక్కును సోమవారం ఎస్పీ హర్షవర్ధన రాజు అందచేశారు. వడమాలపేట ఏఎస్ఐగా పనిచేస్తున్న గురుస్వామి డ్యూటీ నిమిత్తం మార్చి 12న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, అప్పలాయగుంట వద్ద అదుపు తప్పి కిందపడి మృతి చెందారు. అప్పటి ఎస్ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేశారు. జిల్లా పోలీసు అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి పోలీసు శాలరీ ప్యాకేజీ స్కీం నుంచి శాలరీ అకౌంటు వుంటే.. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి, సాధారణ మరణమైతే రూ.10 లక్షలు బీమా అందజేస్తారు. దీంతో ఏఎస్ఐ గురుస్వామి భార్య వై.చిట్టెమ్మకు ఏర్పేడు స్టేట్‌బ్యాంకు బ్రాంచి మేనేజర్, ఎస్పీ చేతుల మీదుగా రూ.కోటి చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.





రంగనాయక మండపంలో వెంకయ్యానాయుడికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అదనపు ఈవో

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన వెంకయ్య నాయుడు ధ్వజస్తంభానికి, తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ, కుటుంబ సమేతంగా భగవత్ దర్శనం చేసుకోవడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. హిందూ ధర్మం ప్రకారం దైవభక్తి ఉండటంతో పాటు సమాజ భక్తి, సేవ, అనురక్తి కూడా కలిగి ఉండాలని సూచించారు.

విధి నిర్వహణలో ఉన్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉండగానే రైల్వే హెడ్ కానిస్టేబుల్ కళ్ళు తిరిగి కింద పడి మృతి చెందారు. ఈ ఘటన సోమవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫారంలో చోటుచేసుకుంది. రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. తిరుపతి జీఆర్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వై.ఎరికలరెడ్డిది కడప జిల్లా తొండూరు మండలం ఇనగనూరు గ్రామం. ఈయన ఏడేళ్లుగా రైల్వే విభాగంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఒకటో ప్లాట్‌ఫారంలో విధి నిర్వహణలో వుండగా నీళ్ళు తాగడం కోసం రైల్వే స్టేషన్ వద్దకు వచ్చే క్రమంలో కళ్లు తిరిగి కింద పడ్డారు. అక్కడున్న పోలీసులు చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే సీఐ ఆశీర్వాదం చెప్పారు.

నన్ను టార్గెట్ చేసి నిర్బంధించారు

- వైల్డ్‌లైఫ్ అండ్ మాక్రో ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ

తిరుపతి(జీవకోన), జూలై 28(ఆంధ్రజ్యోతి): శేషాచల అడవుల్లోని ప్రకృతి అందాలను బాహ్యప్రపంచానికి వెబ్ పేజీ ద్వారా చూపుతున్న తనను టార్గెట్ చేసి పుత్తూరు అటవీశాఖ కార్యాలయంలో అక్రమంగా నిర్బంధించారని వైల్డ్‌లైఫ్ అండ్ మాక్రో ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ ఆరోపించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖ నిబంధనల ప్రకారం సదాశివకోన, జలపాతాలను, దేవాలయాలను సందర్శించాలని 20 మంది స్నేహితులతో కలిసి అటవీశాఖ టిక్కెట్లను కొని ఆదివారం వెళ్లామన్నారు. తిరుగు ప్రయాణంలో తమకు అనుమతిచ్చింది ఈ ప్రదేశం వరకే అంటూ పుత్తూరు అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లి రాత్రంతా గదిలో పెట్టి తాళంవేశారన్నారు. తాను చేసిన తప్పేంటని ప్రశ్నించినా పొంతనలేని సమాధానం చెప్పారన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ప్రాంతంలో తమ వద్ద హామీ పత్రాన్ని రాయించుకుని వదిలి పెట్టారన్నారు. తనను అరెస్టు చేసినట్లు, అపరాధ రుసుం కట్టించుకున్నారని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ చెప్పినట్లుగా సామాజిక మాధ్యమంలో చూశానన్నారు. దివ్యారామంలో చెట్లు నరికిన అంశంపై తాను చేసిన వీడియో అప్పట్లో వైరల్‌గా మారడంతోనే ఇలా కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. 9 ఏళ్లుగా ప్రకృతి అందాలను చిత్రీకరించి బాహ్య ప్రపంచానికి చూపుతున్న తనకు, ఒక రాత్రిలో పరువు పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.



15 వేల మందికి బియ్యం పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 26 నుంచి 30 వరకు దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్దకు తీసుకెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్నారు. 61,251 మందికిగాను ఈ నెలలో మూడు రోజులుగా 15 వేల మందికి బియ్యం పంపిణీ చేసినట్లు డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

యూనియన్‌బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి



డ్వాక్రా సంఘాలకు రూ.5కోట్లు చెక్కు అందజేస్తున్న యూనియన్‌బ్యాంకు అధికారులు

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళల అభ్యున్నతి కోసం యూనియన్ బ్యాంకు అందిస్తున్న మెరుగైన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ జోనల్ అధికారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తొట్టంబేడు మండలం ఇలగనూరు గ్రామంలో సోమవారం పొదుపు సంఘాల మహిళలకు జూలై నెలకు సంబంధించి శ్రీకాళహస్తి యూనియన్ బ్యాంకు శాఖల ద్వారా రూ.5కోట్లు నగదు చెక్కును అందజేశారు. అనంతరం వివిధఅంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ద్వారా పొదుపు సంఘాల మహిళకు త్వరితగతిన సులభంగా రుణాల మంజూరు జరుగుతుందని చెప్పారు. లబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని తెలిపారు. ప్రధానమంత్రి సురక్షబీమా యోజనా ద్వారా సంవత్సరానికి రూ.20 చెల్లించడంతో రూ.2లక్షలు ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ద్వారా సంవత్సరానికి రూ.436చెల్లించి సహజ మరణానికి రూ.2లక్షలు బీమా పొందవచ్చన్నారు. ఇక మహిళలు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ హెడ్ శర్మ, జిల్లా హెడ్ పరశురామ్‌నాయక్, శ్రీకాళహస్తి శాఖ మేనేజరు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రజా సమస్యలు పరిష్కరించండి : సీపీఎం



జేసీకి వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పుత్తూరులోని మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పుత్తూరు కార్యదర్శి వెంకటేష్, దళిత సంఘ నాయకుల నందయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పారిశుధ్యం జాడేలేదని కమిషనర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. శ్మశానాలు ఆక్రమణలకు గురయ్యాయని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామనీ జేసీ హామీ ఇచ్చారు.

అడవిలో ట్రెక్కింగ్‌కు అనుమతులు తప్పనిసరి

● పుత్తూరు రేంజ్ ఆఫీసర్ మాధవి

పుత్తూరు అర్బన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్‌కు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పుత్తూరు రేంజ్ ఆఫీసర్ మాధవి పేర్కొన్నారు. సోమవారం ఫారెస్టు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పుత్తూరు పరిధిలోని మూలకోన, సదాశివకోన ప్రాంతాలు ప్రకృతి సౌందర్యాలతో అలరారుతుంటాయన్నారు. జలపాతాలు, వాగులు, వంకలు, ఏపుగా పెరిగిన వృక్షాలతో ఆహ్లాదకర వాతావరణంతో నిండి ఉంటాయని తెలిపారు. అనధికార ట్రెక్కింగ్‌ల ద్వారా సోషల్ మీడియాలో ఈ ప్రకృతి సౌందర్యాలతో పాటు కల్పిత వీడియోలను కొందరు పోస్టు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఆ వీడియో ప్రచారం పొంది పెద్ద సంఖ్యలో జనాభా అటవీ ప్రాంతాలకు తరలివస్తుండటం పర్యావరణంతో పాటు వన్య ప్రాణులకు ఇబ్బందికరంగా మారుతోందన్నారు. ఇకపై అటవీ ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లే వారు అనుమతులు తప్పక తీసుకోవాలని సూచించారు. ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయరాదని సూచించారు. లేని పక్షంలో అటవీ చట్టం - 1967 ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు.

కాంట్రాక్టు డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు,జూలై28(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అసిస్టెంట్ డిపో మేనేజర్ మంగమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యర్థులు డ్రైవర్లుగా రెండేళ్ల అనుభవంతో పాటు హెవీ లైసెన్సు కలిగివుండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సులను తీసుకుని డిపో కార్యాలయంలో అధికారులను కలవాలని తెలియజేశారు.

ఆర్‌టీఐ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



పుత్తూరు, జూలై28 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అవగాహనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ చట్టం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఉపన్యాసం పోటీలు నిర్వహించామని అన్నారు. అధ్యాపకులు కోటేశ్వరయ్య, నాగేశ్వరరావు, మన్యం నరసింహులు పాల్గొన్నారు.

శుభ్రత- పరిశుభ్రతలో పోలీసులు



వడమాలపేట,జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసగార్డెన్‌లో వీధులను పోలీసులు శుభ్రం చేశారు. సోమవారం శుభ్రత- పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస గార్డెన్‌లోని వీధుల్లో పిచ్చి మొక్కలు తొలగించారు. చెత్త, చెదారాన్ని కాల్చి వేసి వీధులు శుభ్రం చేశారు. పోలీసులు, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది, టీడీపీ నాయకులు ప్రధాన వీధులను శుభ్రం చేశారు. వడమాలపేట ఎస్‌ఐ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలీసులు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

దొరవారిసత్రం, జూలై 28(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం శాలిమర్ నుంచి చెన్నై వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి నవీన్ ఉపాధ్యాయ(34) అనే యువకుడు దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాల కోసం సూళ్లూరుపేట జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న యువతి మృతదేహం అప్పగింత

తడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న యువతి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పూజిత (22) తడలో నివాసం ఉంటూ అపోలో టైర్ల పరిశ్రమలో పనిచేస్తుండేది. ఆదివారం రాత్రి ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఇందుకు ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూజిత మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హామీలన్నీ నెరవేర్చాకే ఓట్లడుగుతాం: విజయశ్రీ

పెళ్లకూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాకే ఓట్లు అడగడానికి వస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెన్నప్పనాయుడుపేట, చెంబేడు, ఆర్లపాడు, పునబాక గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆమె భర్త పార్థసారధి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పర్యటించారు. ఇంటింటికీకి వెళ్లి కరపత్రాలను అందజేసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 14 గ్రామాలకు సాగు, తాగునీటికి ఉపయోగపడే చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు పంపామని, ఆర్థికశాఖ నుంచి అనుమతి రాగానే బడ్జెట్‌లో ఆమోదింప చేస్తామని తెలిపారు. చెన్నప్పనాయుడుపేట రైతుల విజ్ఞప్తి మేరకు చెంబేడు చెరువు నుంచి మూడు కిలోమీటర్ల పంట కాలువ పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ఆర్లపాడు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఏడు పదుల వయస్సులో కూడా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కష్టపడుతున్న సీఎం చంద్రబాబుకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు ప్రసాద్ నాయుడు, రమేష్ నాయుడు, శివకుమార్, సుబ్బరామయ్య, నరేంద్ర యాదవ్, భాను, మల్లిరెడ్డి, హరినాయుడు, యుగంధర్, పోలయ్య, మురళీకృష్ణారెడ్డి, మల్లిరెడ్డి మునివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్లపాడు గిరిజన కాలనీలో దివ్యాంగులకు పింఛను రాలేదని చెప్పడంతో వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం: కురుగొండ్ల

బాలాయపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని కోటంబేడు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. తెలుగంగ కాలువ నుంచి చెరువులకు నీరు అందించాలని రైతులు కోరడంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయడం జరిగిందని, విద్యుత్ కనెక్షన్ ఇచ్చి చెరువులకు నీరు విడుదల చేస్తామని చెప్పారు. పొలాల్లోకి వెళ్లేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో ఉపాధి పథకం కింద ఏర్పాటు చేసిన రోడ్డు అధ్వానంగా తయారైందని, నూతనంగా రోడ్డు నిర్మించాలని రైతులు కోరడంతో వెంటనే రూ.ఐదు లక్షలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వేళ్ల సురేంద్ర రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, ముప్పాళ్ల గురువేంద్ర, నల్లబోతుల మురళి, చిత్తూరు ఈశ్వరయ్య, మల్లెమాల గోపికృష్ణారెడ్డి, సీసీ నాయుడు, దాసరి కోటేశ్వరావు, కొమ్మి గెరటయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కోటంబేడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



కామాక్షీదేవి ఆలయానికి తాళాలు వేసిన్న దృశ్యం - ధాన్యం, పొట్టులో అమ్మవారు, కలశ చెంబు

కామాక్షీదేవి ఆలయం మూత

అమ్మవారి విగ్రహం కింద 107 ఏళ్లనాటి నాణేలు

కోట, జూలై 28(ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలోని కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయాన్ని సోమవారం మూసివేశారు. అమ్మవారికి స్థాన చలనం కల్పించి విగ్రహాన్ని, ఆయుష్‌కు సంబంధించిన కలశ చెంబులను సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భద్రపరిచారు. కుంబాభిషేకాలు నిర్వహించిన అనంతరం అదేస్థానంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని, ఇందులో భాగంగా ఆగస్టు 13 వరకు ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తామని ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ తెలిపారు. ఇదిలా ఉండగా అమ్మవారి విగ్రహాన్ని పెకిలించే సమయంలో తాళమట్టంలో 1918 నాటికి చెందిన నాలుగు నాణేలు లభ్యమయ్యాయి. వేదమంత్రోచ్చారణల నడుమ ఆ నాణేలను, అమ్మవారి విగ్రహాన్ని ఆలయ ఈవో శశ్యాంక్ ఆధ్వర్యంలో భద్రపరిచారు.



ఆలయ తాళమట్టంలో బయటపడిన నాణేలు

మందు బాబులను పట్టించిన డ్రోన్



మన్నారులో లేఅవుట్‌లో మద్యం తాగుతున్న మందు బాబులు

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పోలీసులు డ్రోన్ సాయంతో మందుబాబుల ఆటకట్టిస్తున్నారు. మన్నారు పోలూరులోని ఓ లేఅవుట్‌లో బహిరంగంగా మద్యం తాగుతున్న ఇద్దరిని డ్రోన్ సాయంతో గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌తో నిఘా పెట్టామని, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ నేత మస్తానయ్య మృతి



మస్తానయ్య(ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మన్నారు పోలూరు నూకలపాలెం గ్రామానికి చెందిన గోచి మస్తానయ్య (71) సోమవారం మృతి చెందాడు. ఆయన మృత దేహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు మురళి, చిలకల శ్రీనివాసులు, లక్ష్మయ్య, ఉచ్చూరు రఘు, సాయి, కాంగ్రెస్ నాయకులు ఎం.వెంకటాచలపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేత్ర దానం

మస్తానయ్య నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయకు నేత్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, అలపాటి అశోక్ కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వైజేపీ లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

గూడూరు అర్బన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వైజేపీ లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో వైజేపీ లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఉపేంద్ర మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో విద్య, వైద్య రంగంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు చేయూత నందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోపాల్‌కృష్ణ, శ్రీనివాస్, గౌతమ్, ఆర్‌వీరావు, గురునాథం, రూపేష్‌రెడ్డి, రవిచంద్రరెడ్డి, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వైజేపీ లయన్స్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 24 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.19.66 లక్షల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, మట్టం శ్రావణి, కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం పరిశీలన

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణకు గురైన డేగలపాలెం శ్మశాన స్థలాన్ని సోమవారం తహసీల్దారు గోపినాథరెడ్డి పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో 'దాతలిచ్చిన స్థలాన్నీ వదల్లేదు.. రూ.కోటి విలువ చేసే శ్మశాన భూమి ఆక్రమణ' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు, రెవెన్యూ సిబ్బందితో శ్మశాన స్థలం వద్దకు వెళ్లి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 123-1లో ఉన్న పది సెంట్ల భూమి డేగలపాలెం శ్మశానికి సంబంధించిందని, ఎవరు ఆక్రమించిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.

పొంగిన మురుగు



ఆర్టీసీ బస్టాండు వద్ద పొంగి రోడ్డుపైకి చేరిన మురుగునీరు

సూళ్లూరుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు వద్ద మురుగు కాలువలో చెత్తచెదారాలు పేరుకుపోవడంతో మురుగునీరు పొంగి రోడ్డుపైకి ప్రవహించింది. బస్టాండు, ఆర్అండ్‌బీ బంగ్లాకు మధ్యలో ఉన్న మురుగుకాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగునీరు పారుదల లేకపోవడంతో పొంగి రోడ్డు పైకి ప్రవహించడంతో ఆటువైపు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు స్పదించి మురుగు పొంగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై దృష్టి సారించండి

వెంకటగిరి టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ప్రభుత్వ భూము లు, కాలువలు, అన్యాక్రాంతం అవుతున్నాయని బీజేపీ మాజీ కన్వీనర్ టీటీ మణి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల రికార్డులు మార్చి ఆక్రమించుకుంటున్నారని, ఇదంతా రాజకీయ నాయకుల కనుసన్నల్లో జరుగుతోందన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు

డక్కిలి, జులై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకొంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావిజ్ఞప్తుల దినంలో ఎక్కువగా భూ సమస్యలపైనే అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. మండలంలో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతుండడంతో కఠినంగా వ్యవహరిస్తూ ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. లింగసముద్రంలో దారిని ఆక్రమించి గడ్డి వామి ఏర్పాటు చేయడంతో వెంటనే దాన్ని తొలిగించాలని, లేదంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా పాత నాలపాడు గ్రామంలో కొందరు రాత్రికిరాత్రే ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిమ్మ మొక్కలు నాటడంతో వాటిని తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైన ప్రభుత్వ భూములు ఆక్రమించాలని చూస్తే ఊరుకోనేది హెచ్చరించారు. భూ సమస్యలపై కార్యాలయానికి వచ్చే బాధితులను తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అలాగే మండలంలో నెలకొన్న వివిద భూ సమస్యలను మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయండి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పీఏసీఎస్ చైర్మన్‌గా అల్లూరు కరుణాకర్‌రెడ్డి, సభ్యులుగా దువ్వూరు రవీంద్రరెడ్డి, బచ్చల రవీంద్రరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీ పాలకవర్గం పార్టీలకు అతీతంగా రైతులందరికీ రైతులకు రుణాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్ కుమార్, సోమిశెట్టి చెంచురామయ్య, మట్టం శ్రావణి, పేటేటి చంద్రనీల్, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, అమరయ్య, పెంచలయ్య, సురేంద్ర వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయండి



సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నేతలు

గూడూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ 14 ఏళ్లుగా పట్టణంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. దీంతో ఒకటో, రెండో పట్టణానికి రాకపోకలు సాగించాలంటే ప్రజలు అవస్థలు పడాల్సివస్తోందన్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన ఫ్లైఓవర్‌ను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్, కిరణ్, నవీన్, మహేష్, ప్రసాద్, చైతన్య, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు



శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాష్ట్ర హస్తకళల మాజీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు వజ్రం కిషోర్, మునిలక్ష్మి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా భవనాలపై మారని పేరు



సత్యవేడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇంకా ప్రభుత్వ భవనాలపై పేర్లు తొలగ లేదు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లే దారిలో అప్పటి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా మార్పు చేస్తూ జీవో తెచ్చింది. అయితే ఇప్పటికీ కాళమనాయుడుపేట ఆర్‌బీకేపై పేరు మార్చలేదు. భవనంపై ఇంకా మాజీ సీఎం ఫొటో దర్శనమిస్తోంది.

ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్‌కు సన్మానం



ఏర్పేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ ఇటీవల శాసనసభ వెనుకబడిన వర్గాల సంక్షేమ సంఘం చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి నెల్లూరు వెళుతూ సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో ఆయన అనుచరులు ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, మునిరెడ్డి, మునెయ్య పాల్గొన్నారు.

యువతి వెంట పడుతున్న యువకుడికి దేహశుద్ధి

రేణిగుంట జూలై 28(ఆంధ్రజ్యోతి); యువతి వెంట పడుతున్న యువకుడిని యువతి బంధువులు చితకబాదారు. ఈ ఘటన తిరుపతి - రేణిగుంట మార్గంలోని పారిశ్రామికవాడలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తూకివాకం పంచాయతీలోని ఓ యువతి తిరుపతిలోని ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. ఆటోనగర్‌లో ఉన్న ఓ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న ఓ యువకుడు నెల రోజులుగా యువతి కళాశాలకు వెళ్లే సమయంలో వెంట పడేవాడు. ఈ విషయాన్ని యువతి ఇంట్లో తెలిపింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆ యువకుడి కోసం కాపు కాచారు. యువతి వెనకాల ద్విచక్ర వాహనంలో వస్తున్న యువకుడిని చితకబాదారు. గాయపడిన ఆ యువకుడిని గాజులమండ్యం పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులు సెల్‌ఫోన్ వదిలి చదువుపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఏజీఎం సురేష్

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్లను వదిలి చదువుపై దృష్టి పెట్టాలని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సురేష్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్త్రీవిద్య ఆవశ్యకతపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పార్థసారథి, ఎస్ఐ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం, రమేష్, ప్రిన్సిపాల్ మాధవీలత పాల్గొన్నారు.

శిలాఫలకాలు కూల్చే సంస్కృతి వైసీపీదే: టీడీపీ



మాట్లాడుతున్న జయప్రకాష్

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): శిలాఫలకాలు కూల్చే సంస్కృతి వైసీపీ నాయకులదేనని టీడీపీ నాయకుడు జయప్రకాష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో శిలాఫలకాలు ప్రస్తుతం ధ్వంసం చేసినట్లు లేనిపోని డ్రామాలను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. వైసీపీ గెలిచిన వెంటనే జగన్‌రెడ్డి ప్రజావేదికను కూల్చగా నియోజక వర్గంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అభివృద్ధి పనులకు వేసిన శిలాఫలకాలను వైసీపీ నాయకులు ధ్వంసం చేశారన్నారు.

పేదల పక్షాన పోరాడేది సీపీఐ మాత్రమే

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడేది సీపీఐ మాత్రమేనని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య అన్నారు. శ్రీకాళహస్తి మండలం ముళ్లపూడి ఎస్టీకాలనీలో మండల కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముందుగా సీపీఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం గురవయ్య మాట్లాడుతూ పేదలకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వైఎస్ మణి, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు కార్తీక్, మురళి, జనార్ధన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మునిచందు, రాజయ్య, మణి, నరసింహారావు, బత్తెమ్మ, ఈశ్వరమ్మ, గోవిందయ్య పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయానికి వెండి ఆభరణాల వితరణ



వెండి అభరణాలను వితరణ చేస్తున్న దాత

ఏర్పేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం ఆలయానికి రూ.8.20లక్షలు విలువ చేసే 6,300 గ్రాముల వెండి ఆభరణాలను ఆదివారం పాకాలకు చెందిన తులసీగోమాత ట్రస్టు ప్రతినిధులు అందజేశారు. వాటిని ఈవో రామచంద్రారెడ్డి స్వీకరించారు. ఈవో, అర్చకులు వంశీకృష్ణశర్మ వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు మాజీ చైర్మన్ గిరినాయుడు, పూర్వ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రేపు ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద హుండీలను బుధవారం ఉదయం 7గంటలకు కోట మండపం వద్ద లెక్కించనున్నట్లు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఆగమోక్తంగా మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి అభిషేకాలు జరిపించారు. తర్వాత వివిధ పుష్పాలతో వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ఏర్పేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య అన్నారు. ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామంలో సోమవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మంజుల, పంచాయతీ కార్యదర్శి మురగయ్య, ఎల్‌హెచ్‌సీపీలు లహరి, రమ, ఏఎన్ఎంలు ఉషారాణి, ఆనందకుమారి, లలిత, ఆశా కార్యకర్తలు శుభరత్న, శ్యామల, ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పీ4 సర్వే త్వరగా పూర్తిచేయాలి

కేవీబీపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లో పర్యటించి పీ4 సర్వేను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో మాలతి ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువగా గిరిజన కాలనీలు, దళితవాడల్లో పీ4కు సంబంధించిన కుటుంబాల వారు ఉంటారని వారి నివాసాలకు వెళ్లి సమగ్రంగా పరిశీలించి త్వరగా నివేదికలను అందజేయాలని సూచించారు.

ఉపాధి పనులు కల్పించండి

కేవీబీపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపేడు గ్రామంలో ఆరు నెలలుగా ఉపాధి పనులు లేక కూలీలు బాధపడుతున్నారు. ఇక్కడ ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ విషయంలో తలెత్తిన వివాదంతో ప్రస్తుతానికి పంచాయతీకి ఫీల్డ్ అసిస్టెంట్ లేరు. దీంతో పనులు కల్పించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రం చేసిన పోలీసులు

రేణిగుంట జూలై 28(ఆంధ్రజ్యోతి):ప్రజలు పరి సరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రేణిగుంట అర్బన్ పోలీసులు స్వయంగా చెత్తతొలగించి అవగాహన కల్పించారు. సోమవారం పాంచాలి నగర్లో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వెయ్యకుండా తమ ప్రాంతాల్ని శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలలో చైతన్యం కలిగించారు. అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ ఐ అరుణ్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



స్త్రీ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

● రూ.1.72 కోట్లు స్త్రీనిధి చెక్కులు పంపిణీ

పిచ్చాటూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. సోమవారం పిచ్చాటూరు వెలుగు కార్యాల యంలో డ్వాక్రా సంఘాలకు రూ.1.72 కోట్ల స్త్రీనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో సుమారు రూ.10 కోట్లు చెప్పున స్త్రీనిధి రుణాలు పంపిణీ చేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం మండలంలోని 54 డ్వాక్రా సంఘాల్లోని 182 మందికి రూ.1,71,75000లు చెక్కులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఉచిత బస్సు పథకాన్ని ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని తెలియజేశారు. త్వరలో ఇళ్లు లేని పేద మహిళల పేరిట 3 సెంట్లు ఇంటి పట్టాలు ఇస్తామన్నారు. అంతకుముందు మహి ళలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, ఎంఈవో హేమమాలిని, ఏపీఎం చంద్రకళ, క్లస్టర్ ఇన్‌చార్జి బాషా, టీడీపీ సీనియర్ నాయకులు పద్మరాజు, బుజ్జి నాయుడు, సుమాంజలి, వెంకటరత్నంనాయుడు, రాజేశ్వరి, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం



ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ తొట్టంబేడు మండలం చియ్యవరంలో పర్యటించారు. అక్కడ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రజా సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు. ● ఇక శ్రీకాళహస్తి పట్టణంలో 18వ వార్డు పరిధిలో కూడా టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథచారి, వన్నెకుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు, నాయకులు కోట చంద్రశేఖర్, వజ్రం కిషోర్, మునిరాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠం అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈవో, హెచ్ఎం, ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 15 సంవత్సరాలు నిండిండిన వారు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఒకే సంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించే అవకాశం ఉందని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో -2 మునిసుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కోర్సుకు సంబంధించిన పోస్టర్లను ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు రమణయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15సంవత్సరాలు నిండి బడి మానేసినటువంటి, ఫెయిల్ అయిన వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. సెలవురోజుల్లో మాత్రమే తరగతులు ఉంటాయని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు, దివ్యాంగులకు, ట్రాన్స్ జెండర్లకు అడ్మిషన్ ఫీజులో రాయితీ ఉంటుందన్నారు. వివరాలకు 9502527708 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైతుల సంక్షేమానికి టీడీపీ కృషి

ఏర్పేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ సీనియర్ నేత ధనంజయులనాయుడు అన్నారు. ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రావు, నాగరాజునాయుడు, దొరస్వామియాదవ్, అంకయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఎండీపుత్తూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం



కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం 11వ వార్డు పరిధిలోని సంతమైదానంలో టీడీపీ నాయకులు పర్యటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు, డ్రైన్లు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరారు. డ్వాక్రా సంఘాల సమావేశానికి గది నిర్మించి ఇవ్వాలని కోరారు. గుండె జబ్బుతో బాధపడుతున్న ఓ బాలిక ఆదుకోవాలని కోరింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంఠా రమేష్, పేట బాలాజీ, షాకీరాలీ, సాయి, ఖాదర్‌బాషా, అస్మత్, మధు, లోకేష్, శ్రీలక్ష్మి, సుమతి, లక్ష్మి, మస్తాన్, మహమ్మదర్ షఫీ, రఫీ, మీర్జా, సాజిత్, నయాం తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ అధికారి షణ్ముగం సోమవారం పంపిణీ చేశారు. పది కేజీల జీలగలు 50 శాతం రాయితీపై రూ. 615లకు, నవధాన్యలు పది కేజీలు రూ. 650లకు అందజేశారు. జీలగలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకురావలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రేవతి, రైతులు కన్నయ్యనాయుడు, గోపి, సాంబశివయ్య పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగలో జీలగలను పంపిణీ చేస్తున్న ఏవో షణ్ముగం

ముగిసిన చెంగాళమ్మ జాతర



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట గ్రామంలో చెంగాళమ్మ దేవత ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లజామున వరకు వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలకంరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వేసిన చెంగాళమ్మ దేవత ముగ్గు ఎంతోగానో ఆకట్టుకుంది. భక్తులు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టారు.

రీ సర్వే వేగవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి సచివాలయ పరిధిలోని చల్లామాంబపురం, తిమ్మాభూపాలపురం, చిన్నాయ్యగుంట గ్రామాలలో జరుగుతున్న రీ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కంచాలని, విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, సర్వేయరు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యం



మృతుడు గజేంద్ర (ఫైల్‌ఫొటో)

నాగలాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని తిప్పారెడ్డి, వెంకటేశ్వరరావులకు చెందిన వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు నాగలాపురంలోని పొట్టినాయుడు వీధికి చెందిన గజేంద్ర (60)గా గుర్తించారు. మృత దేహానికి సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ సునీల్, శిక్షణ ఎస్ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3న బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆగస్టు 3వ తేదీన బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్ సీనియర్స్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సబ్ జూనియర్ క్రీడాకారులు జనవరి 2, 2010లోపు జన్మించి ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, బ్లడ్‌గ్రూప్ వివరాలు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. ఇక డ్రెస్‌కోడ్ పాటించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 7013754776 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సెక్యూరిటీ గార్డులను తొలగించరాదు

శ్రీకాళహస్తి, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెక్యూరిటీ గార్డులను తొలగించవద్దని పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలకు పైబడిన వారిని సుమారు 30మందిని తొలగిస్తూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. వారిని అర్థాంతరంగా తొలగిస్తే కుటుంబపోషణ భారం అవుతుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మానవతా దృక్పథంతో వ్యవహరించి సెక్యూరిటీ గార్డులను కొనసాగించాలని ఆయన కోరారు.

సరైన మోతాదులో ఎరువుల వాడకం క్షేమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న వేణుగోపాలరావు

నారాయణవనం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సరైన మోతాదుతో ఎరువుల వాడకంతో అధిక ఉత్పత్తితో పాటు సాగు భూమి క్షేమకరంగా ఉంటుందని జిల్లా వనరులు కేంద్ర వ్యవసాయాధికారి వేణుగోపాలరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని సముదాయం గ్రామంలో పీఎంఆర్కేవీవై పథకం ద్వారా జిల్లా వనరులు కేంద్రం తిరుపతి వారిచే రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయాధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ అధిక ఎరువుల వాడకంతో భూమితో పాటు మన ఆరోగ్యం కూడా పాడవుతుందని పేర్కొన్నారు. పుత్తూరు డివిజన్ ఏడీఏ లక్ష్మీదేవి మాట్లాడు తూ సేంద్రియ ఎరువులు శ్రేయస్కరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శోభ, సహాయకురాలు రమ్య, జిల్లా వనరుల కేంద్రం ఏఈవో రవిచంద్ర, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

సత్యవేడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 3, 4వ తేదీలలో సూళ్లూరుపేటలో జరగనున్న తిరుపతి జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఐ జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సిద్ధులయ్య, సీనియర్ నాయకులు బాలగురునాథం, కృష్ణమూర్తి, చంద్ర, తరుణ్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ సర్కిల్ వద్ద సోమవారం సీపీఐ తిరుపతి జిల్లా రెండవ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు హరినాథరెడ్డి మాట్లాడుతూ సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపడుతున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య పాల్గొన్నారు.